# ఈనాటి ఈ బంధమేనాటిదో!

## వసుంధర

వసంత నాకు ప్రాణం. చిన్నప్పుడు మేమిద్దరం ఒకే కంచంలో తిని ఒకే మంచంలో పడుకునేవాళ్లం.

మా ఇద్దరివీ పక్క పక్క ఇళ్ళు. సాయంత్రాలు తను వేరే ఆడపిల్లలతో వెళ్ళేది కాదు ఆడుకుందుకు. నేను మగపిల్లలదగ్గరకు వెళ్ళేవాణ్ణికాదు. నేను కథలు చెప్పేవాణ్ణి. తను వినేది. తను పాటలు పాడేది. నేను పరవశించేవాణ్ణి.

నాకంతగా పాటలు రావు. కానీ వసంత నా చేత బలవంతంగా పాడించే పాట ఒకటి ఉంది.

పెద్దవాళ్ళతో కలిసి మేమిద్దరం మూగమనసులు సినిమా చూశాం. ఆ సినిమా మాకు అర్థమైన దాన్ని బట్టి మా ఇరువురిదీ కూడా. జన్మజన్మల బంధమని ఇద్దరం అనుకున్నాం.

ఈనాటి ఈ బంధమేనాటిదో అన్న పాట వసంత బాగా నేర్చుకుని తను అచ్చం సినిమాలోలా పాడడమే కాక ఒక వారంరోజులు కృషి చేసి నాకూ అంత బాగానూ నేర్పింది. మేమిద్దరం ఆ పాటను యుగళగీతంలా అచ్చం సినిమా హీరో హీరోయిన్లలా పాడుకునేవాళ్ళం.

వసంత నాకు చెప్పింది — "పెద్దయ్యాక మనం పెళ్లి చేసుకుందాం"— అని.

"ఎందుకు?" అన్నాను.

"మనం ప్రేమించుకుంటున్నాం!" అంది వసంత.

ప్రేమంటే ఏమిటో నాకు సరిగ్గా తెలియదు. నాకంటే రెండేళ్ళు చిన్నదైన వసంతకు తెలుసుననే అనుకున్నాను. అభిమానం అడ్డువచ్చి ప్రేమంటే ఏమిటీ అని నేనడగలేదు. ప్రేమించుకున్న వాళ్ళు పెళ్ళి చేసుకుంటారని నాకూ తెలుసు.

"అలాగే — మరి మీ వాళ్ళు బాగా కట్నం ఇచ్చుకోగలరా?" అన్నాను.

అప్పుడు నాకు పదేళ్ళు. పెళ్ళంటే కట్నం అడగాలని అప్పుడే నాకు తెలుసు.

వసంత నవ్వేసి — "ప్రేమించుకున్న వాళ్ళకు మనసులే కట్నం. డబ్బు కావాలని వాళ్ళ పెద్దవాళ్ళు అడుగుతారు. అప్పుడు వాళ్ళు పెద్దవాళ్ళనెదిరించి పెళ్లి- చేసుకుంటారు. కష్టాలు పడతారు"— అంది.

"కష్టాలెందుకు?" అన్నాను.

"పెద్దవాళ్ళు ఇంట్లోంచి గెంటేస్తారుగా! అందుకు..."

పెద్దవాళ్ళు ఇంట్లోంచి గెంటేయడం తల్చుకోగానే నాకు భయం వేసి —"మా అమ్మ లేకుండా నేనుండలేను. అయినా నేను పెళ్ళి కోసం మా అమ్మనెందుకు వదిలి పెట్టాలి!" అన్నాను.

అప్పుడు వసంత పాట పాడింది —"ఈనాటి ఈ బంధమేనాటిదో!"

ఆమె పాడుతూంటే నేను పరవశించి తనలో శృతి కలిపాను.

వసంత కోసం అమ్మను వదలగలనో లేనో తెలియదు, కానీ ఆమెతో కలిసి పాడాను.

ఆ పాట ఇప్పటికీ చెవుల్లో గింగురుమంటోంది. వసంత రూపం ఇప్పటికీ నాకనులముందు చెరగలేదు.

నాకు పదేళ్ళప్పుడే నేనూ, వసంతా విడిపోయాం. మా నాన్నగారికి ఉద్యోగరీత్యా ట్రాన్స్‌ఫరైంది.

అప్పుడిద్దరం కన్నీళ్ళలో ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకున్నాం. ఆ తర్వాత నుంచి ఒకరికొకరు వారం వారం ఉత్తరాలు రాసుకునేవాళ్ళం. మా ఉత్తరాల్లో మాకు వచ్చినంతలో కవిత్వం కూడా ఉండేది.

మా ఉత్తరాలు వసంతకు పదహారేళ్ళు వచ్చేవరకూ కొనసాగాయి. అప్పుడు వసంత నాకో ఉత్తరం రాసింది. అదే ఆమెనుంచి ఆఖరు ఉత్తరం.

"మా వాళ్ళు నాకు సంబంధం స్థిరపరిచారు. నువ్వు వ వచ్చి ఆపాలి. నువ్వు రమ్మంటే నీతో వచ్చేస్తాను. మనమిద్దరం ఎక్కడికైనా వెళ్ళిపోదామంటే అలా చేయడానికి కూడా నేను సిద్ధమే! వెంటనే ఏ విషయమూ రాయి"—

ఆ ఉత్తరం నాలో లక్ష ఆలోచనలు రేపింది. అప్పుడు నాకు పద్దెనిమిదేళ్ళు. ఒక ఆడపిల్లతో కలిసి ఇల్లువదిలి బతికే అవకాశం నాకింకా లేదని చెప్పే విచక్షణ మాత్రం ఆ వయసు నా కిచ్చింది. నన్ను మనసారా ప్రేమించి గుడ్డిగా నమ్మి నాతో వచ్చేయడానికి అయినవాళ్ళందరినీ వదులుకునేందుకు సిద్ధపడిన ఆ ముగ్ధమనసునూ, వయసునూ అందుకునే ధైర్యం మాత్రం నా వయసు నా కివ్వలేదు.

"నేను అసహాయుణ్ణి. ఇప్పుడేమీ చేయలేను. నీ ప్రేమబలంతో నాకోసం కనీసం నాలుగేళ్ళైనా ఆగు. నిన్ను నా దాన్ని చేసుకోగల బలం సంపాదించుకుంటాను—" అని నేను వసంతకు బదులు రాశాను.

ఆ తర్వాత వసంత నుంచి నాకు జవాబు రాలేదు. రెండునెలల తర్వాత మా ఇంటికి ఆమె పెళ్ళి శుభలేఖ వచ్చింది. ఆ రోజు నేను చాటుగా ఓ గదిలోనికి వెళ్ళి ఏడ్చాను. నా వసంత నాకు శాశ్వతంగా కాకుండా పోయింది. అందుకని నేను నా మనసునిండా ఆమెనే నింపుకుని ఇంక వేరే వివాహం చేసుకోకుండా ఆమెకు నా ప్రేమ గొప్పతనాన్ని తెలియజేయాలనీ, ఒక రోజున ఆమె అసహనాన్ని నిందించాలనీ నిర్ణయించుకున్నాను.

నా ఇరవై రెండవ ఏట ఫారిన్ వెళ్ళే అవకాశం వచ్చింది. వెళ్ళే ముందు నాకు పెళ్ళి చేయాలని అమ్మా నాన్నా అనుకున్నారు. నేను ఒప్పుకోలేదు.

అమెరికాలో నేను నాలుగేళ్ళు ఉన్నాను. ఈ నాలుగేళ్ళలోనూ ఒక డాక్టరేట్ డిగ్రీతో పాటు బోలెడు డబ్బు సంపాదించాను.

నేను అమెరికాలో ఉండగా నాకు ఒకసారి వసంత నుంచి ఉత్తరం వచ్చింది. తను నా అడ్రసు మా వాళ్ళ దగ్గర్నుంచి సంపాదించిందట. తన భర్త ఎంతో మంచివాడనీ తన జీవితం సుఖంగా ఉన్నదనీ ఆమె వ్రాసింది. నన్ను కూడా పెళ్ళి చేసుకోమని వ్రాసిందామె.

ఆ ఉత్తరం చదవగానే నాకు చాలా కోపం వచ్చింది.

"నా మనసు ఒకరికే అంకితం. ఆ ఒకరు నాకు దొరక్కపోతే నేనెప్పటికీ ఒక్కడిగానే ఉండిపోతాను—" ఇదీ నా జవాబు.

ఆ తర్వాత కొంతకాలం పాటు వసంత నుంచి ఉత్తరాలు లేవు.

నేను అమెరికాలో ఆఖరు సంవత్సరంలో ఉండగా ఆమె నాకు మళ్ళీ ఉత్తరం రాసింది.

తనిప్పుడు మా అమ్మా, నాన్నలుంటున్న ఊళ్ళోనే ఉందిట. ఆమె భర్త రెండు సంవత్సరాలుండి రావడానికి ఆస్ట్రేలియా వెళ్ళాడుట. వీలుంటే తననూ చివర్లో తీసుకుని వెళ్ళవచ్చునట.

ఈ ఉత్తరం చదవగానే నా మనసు పరిపరి విధాలపోయింది. నేను త్వరలో ఇండియా చేరుకోబోతున్నాను. అక్కడికి చేరుకోగానే అమ్మా నాన్నా పెళ్ళి అంటారు. పెళ్ళంటే వసంత తప్ప వేరొకరిని భరించలేను నేను.


**నేను ఇండియాకు తిరిగి వచ్చాను. అమ్మా, నాన్నా నన్ను చూసి ఎంతో సంతోషించారు. కాసేపు అవీ ఇవీ కబుర్లయేక నాకు వస్తున్న పెళ్ళి సంబంధాల జోరు గురించి చెప్పారు. నేనువసంతవివరాలడిగి తెలుసుకున్నాను.**

అమెరికాలోని సాంఘిక జీవితం నాపై కొంత ప్రభావాన్ని చూపించింది. నేను ప్రేమిస్తున్నది వసంతని. కావాలనుకుంటున్నది వసంతని. ఆమెకు పెళ్ళి అయిపోతేనేం? నేను మళ్లీ పెళ్ళి చేసుకోవచ్చు. ఆమెతో కలిసి హాయిగా జీవించడానికి తగినంత డబ్బు కూడా ఇప్పుడు నా వద్ద ఉంది.

ఈ విషయం వసంతకు రాశాను. వసంత వెంటనే అలాంటి ఆలోచన మహాపాపం అని జవాబు వ్రాసింది.

"నువ్వు నన్ను ప్రేమిస్తున్నావో లేదో తేల్చి చెప్పు. నాకు నువ్వు కావాలి. నేను నీకు అక్కర్లేదనుకుంటే ఎంతో చిన్న వయసు నించే నీకు మోసగించడం అలవాటైందనుకుంటాను. పదహారేళ్ళ వయసులో నాతో వచ్చేయడానికి సిద్ధపడ్డ పిల్ల ఇప్పుడు స్వార్థం మరిగిందనుకుంటాను. కానీ నిన్ను వదిలిపెట్టను. నా దగ్గర భద్రంగా దాచుకున్న నీ ఉత్తరాలతో నీకు మనశ్శాంతి లేకుండా చేస్తాను"— అంటూ ఆమెకు ఇష్టం వచ్చినట్లు వ్రాశాను.

దీనికి వసంత బదులు వ్రాసింది —"నీ మాట కాదనను. నీ కోసం ఎదురు చూస్తుంటాను. త్వరగా దేశానికి తిరిగిరా! నీ పాత వసంతను మళ్ళీ చూస్తావు..."




ఆ ఉత్తరం నాకు కలిగించిన ఆనందమింతా అంతా కాదు. పదే పదే దాన్ని ముద్దుపెట్టుకున్నాను. ఆ తర్వాత దేశానికి తిరిగి వెళ్ళడం కోసం నిజంగానే ఎదురుచూశాను ఆత్రంగా.

రోజులు ఎవరికోసం ఆగవు.

నేను ఇండియాకు తిరిగి వచ్చాను. అమ్మా, నాన్నానన్ను చూసి ఎంతో సంతోషించారు. కాసేపు అవీ ఇవీ కబుర్లయేక నాకు వస్తున్న పెళ్ళి సంబంధాల జోరు గురించి చెప్పారు.

అన్నీ విని నేను యథాలాపంగా అడిగినట్లు వసంత వివరాలడిగి తెలుసుకున్నాను.

వచ్చిన మర్నాడే వసంత ఇంటికి వెళ్ళాను.

ఇంటి ముందు వసంత భర్త నేమ్‌ప్లేట్ కనబడింది. అది చూడగానే నాకు బాధ కలిగింది. ఆ బాధను అణచుకుంటూ కాలింగ్‌బెల్ కొట్టాను.

తలుపు తెరుచుకుంది. సుమారు పాతికేళ్ళ యువతి తలుపుతీసింది.

"నా పేరు రాజు. వసంతగారున్నారా?" అన్నాను.

"రండి — లోపలకు. ఆమెను పిలుస్తాను—" అన్నదామె.

ఎనిమిదవ ఏట విడిపోయాక వసంతను చూడడం ఇదే మొదటి సారి అవుతుంది. ఎలా ఉందో వసంత!

నేను లోపల సోఫాలో కూర్చున్నాను.

ఆ యువతి లోపలకు వెళ్ళింది. కొద్ది క్షణాల అనంతరం లోపల్నుంచి అడుగుల చప్పుడు వినబడింది. ఊపిరి బిగబట్టాను.

గదిలోనికి ఒక పాప అడుగుపెట్టింది.

నేను ఆమెను చూసి ఉలిక్కిపడ్డాను.

ఆమె.... ఆమె... నా పాత వసంత...

ఎనిమిదేళ్ళ అందమైన పాప....

వసంత నా దగ్గరకు వచ్చి —"పాట పాడనా?" అంది.

"ఊఁ.."అన్నాను.

"ఈనాటి ఈ బంధమేనాటిదో!" వసంత పాట మొదలుపెట్టింది.

నేను ఏ లోకాల తేలిపోతున్నానో తెలియదు. అప్రయత్నంగా పాటలో శృతి కలిపాను.

అలా ఎంతసేపు జరిగిందో నాకూ తెలియదు.

పాట అయిపోయింది. వసంత లోపలకు వెళ్ళిపోయింది.

"వసంతా!" అన్నాను.

అప్పుడు లోపల్నుంచి ఇందాకటి యువతి వచ్చింది.

"వసంత కావాలి నాకు—" అన్నానామెతో అప్రయత్నంగానూ, అమాయకంగానూ.

ఆమె నవ్వి —"నన్ను గుర్తు పట్టలేదా రాజా!" అంది.

నేనామెను ఆశ్చర్యంగా పరీక్షగా చూశాను. ఆమెను నేను ఎక్కడా చూసినట్లు కూడా అనిపించడంలేదు.

"నేనే వసంతను!" అన్నదామె.

"నువ్వు... నువ్వు... వసంతవా!" అన్నాను.

ఆమె నిట్టూర్చి —"అవును రాజా! మన మనసుల్లో చెరగని రూపాలు వేరే ఉన్నాయి. మీ యింట్లో నీ ఫోటో చూసి ఉండకపోతే నేనూ నిన్ను గుర్తు పట్టి ఉండేదాన్ని కాదు—" అంది.

నేనామె వంక ఆశ్చర్యంగా చూస్తున్నాను.

"ఈ రూపం నీకు అపరిచితమైనది. నీకు సుపరిచితమైన రూపాన్ని నేనిచ్చాను. అందుకు నీవు నాకూ, నా భర్తకూ ఋణపడి ఉండాలి. మరీ నేనూ, నీకు ఋణపడి ఉండే అవకాశమెప్పుడిస్తావు?" అన్నది వసంత.

నేనేమి మాట్లాడలేదు.

"రాజా! ఈ నాటి నన్ను నువ్వెరుగవు. ఒకనాటి నన్ను నేను నీ కనుల ముందుంచాను. నా పాపను నువ్వు తీసుకుని వెడతానంటే నాకు అభ్యంతరం లేదు—"

నేను ఆలోచిస్తున్నాను.

నా ఎదుట నున్న ఈ వసంతపై నా ప్రేమ అర్థరహితం. ఆమె ఎవరో నాకు తెలియదు. నాకు తెలిసిన వసంత ఇప్పటికీ ఈ యింట్లో వుంది. ఆమె వసంత కూతరు. అచ్చం మున్మూర్తులా వసంతను పోలిన ఆమె—వసంత కూతురు!

ఆమె నాకేమవుతుంది? ఆ పాపను నేను ఎలా ప్రేమించాలి?

నా ప్రేమలోని మూర్ఖత్వం నాకు అర్థమయింది.

"నేనూ నీకు పాత రాజును చూపించడానికి ప్రయత్నిస్తాను. ప్రస్తుతానికి సెలవు తీసుకుంటున్నాను..." అక్కణ్ణించి కదిలాను.



## రాయి

బాల్య స్నేహితులయిన మధు, రవి చాలా ఏళ్ల తర్వాత కలిసారు. "ఎప్పుడూ అతనే ప్రేమించాను. ఆమెను తప్పితే మరెవర్నీ పెళ్లి చేసుకోను అనేవాడివి. మరి గీతను పెళ్ళి చేసుకున్నావేం?" అడిగాడు మధు

"ఏరాయి అయితేనేం పళ్లూడగొట్టుకోడానికి" నీరసంగా చెప్పాడు రవి.

—బి. చంద్రశేఖర్
(బంగారుపాళ్యం)

వసంత అప్రయత్నంగా —"ఈనాటి ఈ బంధమేనాటిదో..." అంటూ పాట అందుకుంది. నేనామెతో శృతి కలపలేదు. క్షణాల మీద అక్కడి నుంచి బయటపడ్డాను.

*




"కర్కశంగా, గరుకుగా ఉండే పళ్లపొడులు మీ పళ్లకు, చిగుళ్లకు హాని కలిగించవచ్చు..."

TP.GKE.31 TL

# కోల్గేట్ టూత్ పౌడర్‌తో మీ చిగుళ్ళను, చెడుశ్వాసను కూడా అరికట్టండి పళ్ళను కాపాడుకోండి.

కోల్గేట్ టూత్ పౌడర్ ఎంతో మెత్తగా ఉండే తెల్లని పౌడర్.
అది అతి మృదువుగా మీ చిగుళ్ళను తోముతుంది.
అంతేగాకుండా దానిలో ఉండే సున్నితమైన మెరుగునిచ్చే
పదార్థం మీ పళ్ళ మీది పాచిపొరలను తొలగిస్తుంది.
మీ పళ్ళను శుభ్రపరచి తెల్లగా చేస్తుంది. కోల్గేట్‌లోని
ప్రత్యేకమైన నురుగునిచ్చే చర్య పళ్ళ సందులలోనికి
చొచ్చుకుపోయి చెడు వాసనను దంతక్షయకారకమైన
సూక్ష్మక్రిములను తొలగిస్తుంది.

మీ కుటుంబానికి కోల్గేట్ టూత్ పౌడర్‌తో
[illegible] తీరులో దంతరక్షణ సమకూర్చండి.
[illegible], పిప్పర్‌మెంట్ రుచిని
వారంతా మెచ్చుకుంటారు.

